మాంచాల

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

[మాంచాల తన మనోహరుడు బాలచంద్రుని గూర్చి తియ్యని కలలుకంటూ ఉంది.]

మాంచాల:-రాజా ! నీ చిన్నారివదనాన్ని చూడాలని ఈ కన్నె హృదయం ఎంత ఆరాటపడుతున్నది! ఆ నాడు మన వివాహ సమయంలో మీ సుందర విగ్రహాన్ని చూశాను. నా హృదయం పరిపూర్ణమయింది. స్వామీ మీ అరుణచరణాలను పూజించే భాగ్యము ఈ దీనురాలకి ఎన్నడు లభిస్తుందో గదా ? ఆహా చంద్రా! నా బాల చంద్రుని పిలుచుక రాక సేవస్తున్నావా ? నన్ను బాధిస్తావా ? ఈ రాత్రి నా బాలచంద్రుడువస్తే-అవును నా హృదయంతో స్వాగతమిస్తాను. వారి పాదాలను నా ఆనంద బాష్పాలతో కడుగుతాను. నా రాజును నా బాహులతా పంజరంలో బంధించుతాను. స్వామీ చెన్నకేశవా ! నేను ఏం పాపం చేశాను దేవా ? నా ప్రభువును నా వద్దకు రప్పింపవా ?

[బాలచంద్రుడు యుద్ధరంగానికి బయలుదేరుతాడు. కాని మాతృమూర్తి ఐతాంబ అనతి ప్రకారం భార్య దీవెనకొరకు మాంచాల గృహానికివచ్చాడు.]

మాంచాల:-ప్రభూ ! వచ్చారా ? ఆగండి, నా ఆనందాశ్రువులతో మీ పాదాలను కడుగుతాను. ఆహా ! మీ వంటి సుందరమూర్తిని భర్తగా బడసిన నేనెంత ధన్యురాలను. మనోహరా ! నా జన్మచరితార్థమైనది రారాజా ? ఈ శరీరంలోని ప్రతిరక్తకణం నీ నామాన్ని జపిస్తుంది. నీ కొరకు వెన్నెలలేని చకోరపక్షివలె కాలం గడుపుతున్నాను. ఈ నాటికి జన్మ తరించింది. నా కోర్కె ఫలించింది.

[బాలచంద్రుడు మాంచాల మనోహర విగ్రహాన్ని చూచి ఆశ్చర్యపోతాడు. అతని యువక హృదయం ఈ పొంగిపోతుంది. వచ్చిన పనిని మరచిపోతాడు.]

బాలచంద్రుడు:-మాంచాలా ? ఎంత అందమైనదానివి నీవు యీ-నీనీలపు ముంగురులు అంత అందముగా ఉన్నవి. ఈ నీ సుందర రూపమే నా హృదయంలో నిద్రపోతున్న కోర్కెలను మేల్కొల్పినది. నీ నిర్మలమైన అమాయిక చూపులు నీ అందాన్ని మరింత శోభతో నింపుతున్నవి. మాంచాల ఎంత అందమైనదానివి ?

[మాంచాల సిగ్గుతో తలవంచుకుంటుంది. బాలచంద్రుడు ఆమెదగ్గర చనువుగా ప్రవర్తించబోతాడు.]

మాంచాలా! ఎందుకీతొట్రుపాటు! నీ బాలుడు నిన్ను యిన్ని దినాలు గమనించలేదన్నా? విరహమేకదా ప్రేయసీ ప్రియులను దగ్గరకులాగేది. నీతో విహారముకొరకు నా హృదయము ఉవ్విళ్లూరుతుంది.

అగురాణీ! ఎందుకలా తొలగిపోతావు. అదిగో తెల్లని వెన్నెల. నీ వక్షస్థలంమీద పడితే నీ హృదయభారం నల్లగా నీడలాగా కనపడుతుంది. ప్రేయసీ! నా హృదయ మందిరంలో నీ రూపు హత్తుకపోయింది. ఈ సుందరమైన రాత్రిని అందాల భరిణ నా మాంచాలతో గడుపుతాను. నా జన్మను సార్థకపరచుకొంటాను.

మాంచాల:-ప్రభూ పూజ్యురాలు అత్త గారు కుశలమేనా?

బాల:-మరచాను మాంచాలా! నలగామునితో సంధి విఘ్నమైంది. కారెమపూడిలో యుద్ధము ప్రజ్వరిల్లుతూంది. నాన్నగారికి సహాయునిగా వెడుతున్నాను. అమ్మ దగ్గర శలవుతీసికొన్నాను. నీవు నీ నేత్రాల దీప్తితో నీ హృదయ నిర్మలత్వంతో నన్ను యుద్ధరంగానికి సాగనంపాలి. మాంచాలా! ఆ శత్రుమూకను చెండాడి విజయలక్ష్మిని నీకు చెల్లెలుగా తీసికొనివస్తాను. నా రక్తంలో పగ ప్రవహిస్తూంది. శత్రువులను ముక్కముక్కలుగా నరికివెయ్యాలి. ఆ రక్త ప్రవాహంలో నా యీ కరవాలము నాట్యంచేయాలి.

మాం:-జై బాలచంద్రా! విజయలక్ష్మి నేడే నిన్ను వరించింది. పలనాటిని మనమే పాలించుకుంటాము. ప్రజా సమూహానికి పరిపాలనా సౌలభ్యాన్ని కలుగచేద్దాము. బాలచంద్ర ప్రభువుకు సాటివేరేలేరని పలికేటట్లు చేద్దాము. రాజా పాలు తెస్తాను కూర్చోండి!

[పాలకొరకు పోయిన మాంచాల తల్లికి సర్వం నివేదిస్తుంది. కాని యుద్ధరంగానికి వెడలే ప్రియునితో ప్రేయసి చనువుగా ప్రవర్తించకూడదని, అది విజయానికి దోహదం చెయ్యదని, ఎలాగైనా ఈ రాత్రి దూరంగా ఉండేలాగా చూచుకోమని బోధిస్తుంది.]

మాం:-చెన్నకేశవా! ఎన్ని రోజులనుండి ఎదురుచూచాను స్వామీ! నా ప్రభువువస్తే నేను దూరంగా ఉండేదా! యిదేం న్యాయం స్వామీ! నా భర్తతో సుఖంచే భాగ్యము నాకు లేదా! నా యవ్వనం నా ప్రభువుకై వశంకాదా! దేవా నాకెందుకీ సౌందర్యాన్ని ప్రసాదించావు. చందమామ ఆకాశంలో విహరిస్తున్నా, కోయిల కూతవిన్నా, చిరుగాలి అలలతో ఆడుకొంటున్నా నా పతి పాదాల పై

కూర్చోవాలని ఉంటుందే - అట్టి నా కోర్కెలన్నీ వమ్ముపాలు కావలసిందేనా! అమాయికంగా బాలుడు నా వైపు చూస్తుంటే నేనెట్లా వారించేది! చంద్రుడు నా పవిటనుపట్టి లాగితే నేనెట్లా కాదనేది! బాలచంద్రుని మృదువైన వేళ్లను నా నల్లని నీలి ముంగురులలో జొనిపి మాంచాలా! అంటే నేను ఏమని సమాధానము చెప్పేది. నాలుగు జాముల రాత్రిని నేనెట్లా గడిపేది! భగవంతుడా? అవును. గడుపుతాను. నా పతి విజయంకొరకు ఈ రాత్రినే కాదు నా జీవితాన్నే చిరునవ్వుతో త్యాగంచేస్తాను. భారత స్త్రీకి పతి కన్న మిన్నయైనది లేదు. నా పతి రణరంగంలో వీరవిహారంచేసి విజయుడై రావాలి. ఆ నాడు నా శరీరాన్ని వారి కై వశంచేస్తాను. ఇది పలునాటి బిడ్డకొక లెఖ్ఖా? భారత స్త్రీ భర్త కొరకు ప్రాణాలనుకూడా త్యాగం చెయ్యగలదు. అవును ... ఈ క్షణిక సుఖానికాసించి శాశ్వతకీర్తిని నాశనం చేస్తానా? చెయ్యను ప్రభూ? నీ శ్రేయస్సే నా శ్రేయస్సు! మిమ్మ సంపూర్ణంగా యుద్ధరంగాని కంపుతాను ... త్యాగంచేస్తాను. అయినా ఎట్లా గడవదో చూస్తాను.

[మాంచాల పాల గ్లాసుతో ప్రవేశిస్తుంది. బాలచంద్రుడు ఆమె కరాని పట్టుకొని కౌగలించుకోబోతాడు.]

మాం: ప్రభూ! అదుగో దొంగ చూస్తున్నాడు?

బాల:-(చివాలున చెయ్యివదలి) ఎవరాతడు?

మాం:-(చంద్రునివైపు చూపుతుంది.)

బాల:-(నవ్వుతూ) మాంచాలా నీవు అపూర్వ సౌందర్యవతివేకాక సరసురాలవుకూడా?

మాం:-ప్రభూ! తమ స్నేహితులు క్షేమమా? అత్తైతాంబగారు ఆరోగ్యంగా ఉన్నారా?

బాల:-మాంచాలా నీ హృదయం ఎంత ప్రతిభావంతమైనది. ఆహా ... నీ పలుకులు అమృతములాగున్నవి?

మాం: ప్రభూ! అమృతమంటే గుర్తుకొచ్చింది. అమృతం ఎక్కడనుండి వచ్చింది. దాని ప్రభావమేమిటి?

బాల:- దేవీ! అవి తీరిక సమయములో మాట్లాడుకోవలసిన మాటలు. ఈ రేయి హాయిగా గడపాలి. వృధాకాలహరణం చెయ్యకు. రారాణీ! నా కోర్కె చెల్లించు.

మాం:-ఆగు రాజా! నీ రూపాన్ని మనసారా చూడనీయండి? ఆహా ఎంత అందంగా ఉన్నారు?

బాల:-అవును, మాంచాలా దగ్గరికివచ్చి చూడరాదా?

[మాంచాల ఎంత మరపించినా బాలుడుద్రిక్తుడౌతున్నాడు. ఆమె అన్యథా ప్రసంగం పని చెయ్యలేదు. కాని మాంచాల మనసు రాయిచేసికొన్నది. బాలునితో ఏకాంతంగా 4 జాముల రాత్రిని గడపటానికి ఆలోచించింది. అతడు ఆమెను పట్టుకున్నపుడు తన మెడలోని పూసలదండను త్రెంచింది.]

మాం:-స్వామీ చూశారా? తొందరలో నా హారాన్ని తెంచారు?

బాల:-అవును మాంచాలా! తొందరలో పొరపాటు జరిగింది.

మాం:-స్వామీ! చెన్నకేశవుని పేరున ధరించిన దండ, అమ్మకు తెలిస్తే ...

బాల:-అట్లాగా! అయితే ఎంతలోకి కూర్చుదాము - దారముందా?

మాం:-ఉంది స్వామీ - అటు మీరు, యిటు నేను కూర్చుదాము.

బాల:-నిజంగా అర్ధాంగి వనిపించావు మాంచాలా!

[బాలుడు ఒకవైపునుండి కూర్చుతుంటే మాంచాల మరియొకవైపునుండి దూసిపోస్తున్నది. ఎంత కూర్చినా పూర్తికాలేదు. ఇంతలో తెలతెల వారింది. బాలుడు తొందరపెట్టసాగాడు.]

బాల:-మాంచాలా ఎంతకూర్చినా తరగనిదండయిది. తరువాత కూర్చుదాము, ఆహా ...

పచ్చని చీరదాల్చి చిరుపయ్యెద క్రిందికి జారిపోవగా
ముచ్చటగా చివాలు మన ముందుకు వంగగ సుందరాంగి! నీ
మచ్చల నీలవాలుజడ కూర్చను కమ్మని పూలవాసనల్
అచ్చని సుందరాంగి అనుమానమదేలనె రమ్మ కూడగా?

మాం:-ప్రభూ మీరెంత పిచ్చివారు? మీరు చేయబోయే కార్యమా యుద్ధము - అడుగిడే స్థలమా రణరంగము - చేయునదా శత్రుసంహారము-కోరునదా! స్త్రీ సంభోగము! రాజా సమరదీక్షితులకు ఇది సముచితము కాదు. రక్తతిలకాన్ని పాలభాగాన్ని దిద్దుకొని భారతమాత మిమ్ము కర్మవీరుణ్ణి చేస్తున్నది ప్రభూ! లేవండి- రణరంగంలో శత్రుసింహాలను చెండాడండి. కృపాణంతో కుత్తుకల నరకండి! మీ వీరనినాదాలు వింటుంటే నా హృదయం ఉప్పొంగిపోతూంది. ఆ శత్రుశిరాలే నా పూజాపుష్పాలగా చేస్తాను. ప్రభూ! నాకు వీరపత్నిత్వాన్ని ప్రసాదించండి - పలునాటి చరిత్రలో నా పేరును 'త్యాగమూర్తి'గా వీరపత్నిగా సువర్ణాక్షరాలతో లిఖింప

చేయండి. మనోహరా! స్వాతంత్ర్య సిద్ధికిచేసే సమరంలో చనిపోయినా బ్రతికినా మనదే స్వర్గము. ఇదిగో కరవాలము ...

బాల:-మాంచాలా! నా యువక హృదయం నీ సుందరరూపాన్ని చూడగానే ఉద్రిక్తపడింది. నీ అమాయిక చూపులు నా ఆశను మరీ రెచ్చగొట్టినవి. మానవసైజాన్ని మానలేకపోయాను. మన్నించు మాంచాలా! ఆ నాయకురాలి తలనరికి నలగాముని పట్టి నాన్న పాదాలపై వేసి నీ మాటను రణసీమలో నిలుపుతాను. దేవీ! దీవించిపంపు.

మాం:-విజయమూర్తీ! నీ శత్రువులు నామరూపాలు లేకుండాపోతారు. కరుణాకరా! నీ ప్రజలు నీ రాజరికంలో ఆనందమయులౌతారు. రతిరాజ సుందరా! నీ దాసి మాంచాల నీ రాకకై వేచిఉంటుంది. కృష్ణునికి సాటిగా నీకు కీర్తి లభిస్తుంది. మాచర్ల చెన్నకేశ్వరుడు వరములను యివ్వగా వర్ధిల్లుతారు. కలియుగంలో మీకు ఘనమైన పూజలమరుతవి. శౌర్య సుందరమూర్తీ! నాకు వీరపత్నీత్వము, అత్తగారికి వీరమాతృత్వము ప్రసాదిస్తారు. పలనాటిని జయిస్తారు. శత్రువులపై పగదీర్చుకొంటారు. ప్రభూ! యిదిగో రక్త తిలకం.

[అని తన బొటనవ్రేలిని కరవాలంతో గ్రుచ్చి రక్తాన్ని బాలుని ఫాలభాగంలో అలంకరిస్తుంది.]

బాల:-మాంచాలా! మరలా విజయలక్ష్మితో తిరిగివస్తాను.

మాం:-ప్రభూ! స్వాతంత్ర్యసిద్ధే మన పరమాశయము. శత్రుసంహారదీక్షయే మన చరమ లక్ష్యము. ప్రజాశ్రేయస్సే మన జీవిత పరమార్థము. విజయపతీ! నీ సందర్శనమే నా పూజాఫలము. జై బాలచంద్రా ...

(బాలుడు యుద్ధరంగానికి కదుగుతాడు)

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన
'నా చిన్ననాటి ముచ్చట్లు'
వెల రు. 3-0-0
అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.